

# నవభూమి కరీంనగర్

అనుబంధం

28 అక్టోబర్,2024 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## ఎన్‌హెచ్ 63

# బాధితులకు నోటీసులు



**జగిత్యాల, –నవభూమి:** ఆర్మూర్ నుంచి జ గిత్యాల మీదుగా మంచిర్యాల వరకు ఫోర్‌లైన్ హైవే నిర్మా ణానికి గతంలో సర్వే చేపట్టగా ఎట్టకేలకు అధికారులు ప్రాం తాల్లో భూ నిర్వాసితులకు నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లా లోని పలు గ్రామాల్లో హైవే విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులను గుర్తించి వాళ్లకు నోటీసులివ్వడం ప్రా రంభించారు. రెవెన్యూ అధికారులు స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి నిర్వాసితులకు అవగాహణ కల్పిస్తూ నోటీసులు ఇస్తున్నా రు. విలువయిన భూములను ప్రభుత్వానికి అప్పనంగా ఎలా అప్పజెప్పాలని బాధితులు ఆవేదన చెందుతున్నారు. పరిహా రం చెల్లింపు వ్యవహారం తేల్చకుండానే నోటీసులు అందిస్తుం డడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంటలు వేసుకోవద్దని భూ నిర్వాసితులకు సలహాలు...జిల్లాలో జాతీయరహదారి 63 విస్తరణ కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులు రానున్న యాసంగి సీజన్‌లో పం టలు సంబంధిత భూముల్లో వేసుకోవద్దని అధికారులు సూ చిస్తున్నారు. సంబంధిత బాధితులను కలిసి సాధ్యమైనంత తొందరలో పరిహారం అందించడానికి ప్రయత్నిస్తున్నామని, టెండర్లు, పనులు సైతం ప్రారంభం కానున్నాయని వివరిస్తూ యాసంగి సీజన్‌లో సదరు భూముల్లో ఎలాంటి పంటలు సాగు చేయవద్దని కోరుతున్నారు. పంటలు సాగు చేసినట్లయితే అర్ధాంతరంగా వదులు కోవాల్సి వచ్చే ప్రమాదం ఉం దని వివరిస్తున్నారు. దీంతో రైతులు అయోమయానికి గురవు తున్నారు. పరిహారం అంశం తేల్చకముందే అధికారులు నోటీ సులు, టెండర్లు, పనులు అంటూ హడావిడి చేస్తుండడం ఏమిటని వాపోతున్నారు. 27 గ్రామాల్లో...250.0790 హెక్టార్లు భూమి...జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 27 గ్రామాల్లో సుమారు 250 హెక్టార్ల భూమిని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లో 5 గ్రామాల్లో 240 మంది రైతులకు చెందిన 42 హెక్టార్ల భూమిని, కోరుట్ల రెవె న్యూ డివిజన్‌లో 6 గ్రామాల్లో 317 మంది రైతులకు చెందిన 65 హెక్టార్ల భూమిని, జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 16 గ్రా మాల్లో 712 మంది రైతులకు చెందిన 141 హెక్టార్ల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఇందుకు అవసరమైన సర్వేను అధికారులు నిర్వహించారు. ఇటీవల కోరుట్ల, మెట్‌ప ల్లి, జగిత్యాల డివిజన్‌లలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న సర్వే పనులను కలెక్టర్ సంబంధిత అధికార బృందంతో కలిసి పర్యవేక్షించారు. హైవే విస్తరణలో భాగంగా భూసేకరణ పను లను వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. చాలా ప్రాం తాల్లో వ్యవసాయ భూములే నష్టపోతుండగా పలు వెంచర్లకు అనుకూలమైన భూములు సైతం ఇందులో ఉన్నాయి. ఈ భూములను జాతీయ రహదారి విస్తరణకు అప్పగిస్తే రూ. కోట్లలో నష్ట వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 69.300 కిలో మీటర్ల విస్తరణ..నిజామాబాద్ జిల్లా బోదన్ నుంచి జగిత్యాల, మంచిర్యాల మీదుగా మహారాష్ట్ర లోని సిరొంచ నుంచి ఛత్తీస్‌గఢ్‌రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు 63వ నంబరు జాతీ య రహదారి విస్తరించి ఉంది. 2017 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించాలని తలపెట్టినప్పటికీ పలు కారణాల వల్ల పక్కనబెట్టారు. పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు 143 కిలో మీటర్ల దూరం ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని ఫోర్‌లైన్స్‌గా విస్తరించడానికి నిర్ణయిం చారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 30.900 కిలోమీటర్లు, జగిత్యాల జిల్లాలో 69.300 కిలో మీటర్లు, మంచిర్యాల జిల్లాలో 41.813 కిలో మీటర్ల పొడవున నాలుగ వరుసల రహదారి నిర్మాణం పనులు నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భా గంగా జిల్లాలో మెట్‌పల్లి డివిజన్‌లో 14 కిలోమీటర్లు, కోరుట్ల డివిజన్‌లో 17 కిలో మీటర్లు, జగిత్యాల డివిజన్‌లో 38 కిలో మీటర్ల మేర నాలుగు వరసల రహదారి వి స్తరణ జరుపనున్నారు. నిజామాబాద్ జిల్లా పెర్కిట్ ప్రాంతంలో గల 44వ నంబరు జాతీయ రహదారి నుంచి మోర్తాడ్, కమ్మరిపల్లి, జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం బ్రిడ్జి మీదుగా మంచిర్యాల జిల్లా లక్షెట్టిపే ట, క్యాతన్‌పల్లి, వేంపల్లి, రంగంపేట వరకు నాలుగు రహదారుల విస్తరణ జరుపనున్నారు. మార్కెట్ ధరలు చెల్లించాలి కొల్లూరి రవి, భూ నిర్వాసితుడు, గోపాల్‌రావుపేట 63వ నంబరు జాతీయ రహదారిని ఫోర్‌లైన్లుగా విస్తరించడానికి సేకరిస్తున్న భూములకు నష్ట పరిహారం మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇవ్వాలి. డిమాండ్ గల భూములను రహదారి విస్తరణలో కోల్పోవడం వల్ల నష్టాల పాలయ్యే ప్రమా దముంది. భూములకు అసలైన మార్కెట్ ధరలను గుర్తించి ఆవిధంగానే పరిహారం అందించాలి. రైతులకు న్యాయం జరగాలి నర్సయ్య, భూ నిర్వాసితుడు, తిప్పన్నపేట భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అధికారులు సరైన న్యాయం చేయాలి. భూములను నమ్ముకొని బతుకుతున్న రైతులను విస్మరించవద్దు. విలువైన భూము లు కోల్పోతుండడం వల్ల నిర్వాసితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాద ముంది. భూముల్లో వసతులను కల్పించుకోవడానికి ఆర్థికంగా చాలా నష్టాలు ఎదుర్కొన్నాము.

## పంచాయతీ ఉద్యోగుల

# సమస్యలు పరిష్కరించాలి



**సుల్తానాబాద్, –నవభూమి:** జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో పరిశీలించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకోటి వెంకటేశ్ తదితరులు జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను కోరారు. ఈమేరకు ఉద్యోగ సంఘ ప్రతినిదులు డీపీవోను పెద్దపల్లిలో కలిసి ఒక వినతిపత్రం అందజేశామని తెలిపారు. శనివారం ఆయన సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతు కొత్తగా జిల్లా పంచాయతీ అధికారిగా పదవీ భాధ్యతలు చేపట్టిన వీర బుచ్చయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందించామన్నారు. అలాగే తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. అర్హత కలిగిన కారోబారులకు పంచాయతీ కార్యదర్శులుగా అవకాశాలు కల్పించాలని, మిగిలిన ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరామ న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మూలసాల కొమురయ్య, కేశనపల్లి సత్తన్న, ఆసరి రమేష్, గసిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వరదలు ఒకచోట..పనులు మరోచోట




# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చొప్పదండి, -నవభూమి:** రామడుగు జెడ్పిహెచ్ఎస్ లో 2012-13 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రామడుగు లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ హెడ్మాస్టర్ కే. మల్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థిని,విద్యార్థులు తమ జీవన శైలిని,తమ అనుభవాలను ఒక్కొక్కరుగా తమ గురువుల ముందు వివరించారు.అంతేకాకుండా జీవితంలోని కష్టసుఖాలను ఒకరికొకరు పంచుకున్నారు.తమకు పాటాలు నేర్పిన గురువులందరిని సన్మానించారు.విద్యార్థులందరూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని అనంతరం స్నేహితులందరికీ పలు రకాల వంటలు భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు హనుమాన్లు,బ్రహ్మం,శారద,సువిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

**సిరిసిల్ల -నవభూమి:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు.జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 111, ప్రాథమికోన్నత పాఠశాలలు 39, ప్రాథమిక పాఠశాలలు 330 ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 252 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సర్దుబాటు ప్రక్రియను పరిశీలించారు.అనంతరం ఆయా పాఠశాలల వివరాలు పరిశీలిస్తూ ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. వృత్తి నిబద్ధతను పాటిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, ఎంఈవోలు పాల్గొన్నారు.సకాలంలో పరిశ్రమలకు అనుమతులు సిరిసిల్ల కలెక్టరేట్: పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పరిశ్రమలు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అనుమతి కోసం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఏయే కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీపీపీ, టీఎస్ ఐపాస్ కింద పీసీబీ 2, సెస్, ఫ్యాక్టరీస్, నీటిపారుదలశాఖ వద్ద ఒక్కో దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లు పరిశ్రమలశాఖ జీఎం గణేశ్‌రాం తెలిపారు. టీ ప్రైడ్ కింద ఎస్సీలకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద 2 యూనిట్లు మంజూరయ్యాయని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ ఏడీ భారతి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎల్‌డీఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## వరదలు ఒకచోట..

# పనులు మరోచోట

**కోరుట్ల -నవభూమి:** కోరుట్లలోని 11వ వార్డులో వరదలకు కొట్టుకుపోయిన రోడ్డు వరదలు, విపత్తులు సంభవిస్తే ప్రభుత్వం తక్షణ సాయం కింద రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేస్తుంది.ఈ నిధులతో వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది కానీ.. కోరుట్ల పట్టణంలో పురపాలిక అధికారులు పాలకుల సూచనలతో వరదలు సంభవించిన ప్రాంతాల కంటే వరదలు రానీ ప్రదేశాల్లోనే ఎక్కువ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇష్టం వచ్చిన ప్రదేశంలో రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు చేపడుతూ విపత్తు ప్రతిస్పందన నిధి అర్థాన్నే మార్చేస్తున్నారు.ఇష్టారాజ్యంగా..కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ఆగస్టులో వచ్చిన వరదలకు ముంపునకు గురయ్యాయి. రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించాల్సి ఉండగా పాలకుల ఒత్తిడితో ఇష్టారాజ్యంగా నివేదికలు పంపించారు. నివేదికల ఆధారంగా రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) కింద కలెక్టర్ రూ.28.80 లక్షల నిధులను కేటాయించారు. ఈ నిధులతో వరద ప్రాంతాలైన 10, 11, 7 వార్డుల్లోని దెబ్బతిన్న రోడ్లపై సిమెంట్ రోడ్లను నిర్మించాల్సి ఉండగా బల్దియా అధికారులు తమకు నచ్చినచోట ఎస్‌డీఆర్ఎఫ్ నిధులను కేటాయించారు.10వ వార్డులో 2 ప్రదేశాలను మాత్రమే గుర్తించారు. 11వ వార్డులో 6 ప్రాంతాల్లో పనులు చేపట్టాలని గుర్తించారు. ఇందులో 10వ వార్డులోని కేశవ ఆసుపత్రి వద్ద ఎలాంటి వరదలురాని ప్రదేశంలో రూ.లక్ష కేటాయించారు. మరోచోట వరద వచ్చే ప్రాంతంలో రూ.లక్ష మాత్రమే కేటాయించారు. 11వ వార్డులోని వరద ప్రాంతాల్లో కేవలం 6 ప్రాంతాల్లో రూ.5.20 లక్షల నిధులను మాత్రమే కేటాయించారు. అసలే వరదలు సంభవించని ప్రాంతాలైన 28వ వార్డులో 10 పనులకు రూ.9.20 లక్షలు, 32వ వార్డులో 3 పనులకు రూ.3 లక్షలు, 27వ వార్డులో 3 పనులు రూ.2.20 లక్షలు, 2వ వార్డులో 2 పనులు రూ.1.20 లక్షలను కేటాయించారు.ఈ చిత్రంలో కనిపిస్తున్న సిమెంట్ రోడ్డు పట్టణంలోని 28వ వార్డులో గల కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ నుంచి టీచర్స్ క్లబ్ వరకు ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో ఇటీవల నిర్మించారు. ఇక్కడ ఎలాంటి వరదలు సంభవించవు. కేవలం పాత సీసీరోడ్డు దెబ్బతినడంతో నాయకుల సూచనల మేరకు ఇక్కడ వరద ప్రాంతానికి మంజూరైన నిధులతో రోడ్డు నిర్మించారు.ప్రభావిత ప్రాంతాలివి..కోరుట్ల పట్టణంలో ముఖ్యంగా 10, 11 వార్డుల్లో తీవ్రంగా 1, 7, 9, 18, 19, 21, 23, 24 వార్డుల్లో ఓ మోస్తరు వరదలు వస్తుంటాయి. వరదలు వచ్చినప్పు మట్టిరోడ్లు కోతకు గురయ్యాయి. కల్వర్టులు దెబ్బతినడంతో వరద నీరు పారడం ఇబ్బందికరంగా మారింది. వరద ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా నిర్మించకుండా బల్దియా అధికారులు తాత్కాలికంగా మట్టితో మరమ్మతు చేస్తూ ఏళ్లుగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. తాజాగా రూ.28.80 లక్షలతో 8 వార్డుల్లో మొత్తం 32 ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో ఇటీవల అయిదు సిమెంట్ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. కొన్నిచోట్ల కల్వర్టులను నిర్మిస్తున్నారు. అయితే వరదలు ఓ చోట అయితే పనులు మరోచోట చేపట్టడం ఏంటని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై డీఈ సురేశ్‌ను వివరణ కోరగా రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపితే రూ.28.80 లక్షలే మంజూరయ్యాయని.. ఈ మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఇక్కడ కనిపిస్తున్న సిమెంట్ రోడ్డు 32వ వార్డులోని గ్రంథాలయం పక్కనున్న రోడ్డుపై పది రోజుల క్రితం ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.లక్షతో నిర్మించారు. ఇక్కడా వరదలు రావు. కేవలం స్థానిక కౌన్సిలర్, నాయకులు ఒత్తిడితో బల్దియా అధికారులు వరద ముప్పు ప్రాంతానికి మంజూరైన నిధులను ఇక్కడ కేటాయించి సీసీ రోడ్డును నిర్మించారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.







## నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పెద్దల పిలుపు!

**కరీంనగర్ -నవభూమి:** అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ఢిల్లీకి రమ్మని కాంగ్రెస్ ముఖ్య నేతల నుంచి పిలుపు అందినట్లు సమాచారం.దీంతో శనివారం సాయంత్రం ఆయన హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలవాలనే ఉద్దేశంతో నరేందర్‌రెడ్డి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో కాంగ్రెస్‌లో కొనసాగిన ఆయన కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను గతంలో కలిశారు. ఇదే సమయంలో పీసీసీ అధినేత మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి అభ్యర్థిత్వం కోరినట్లు సమాచారం. తాజాగా పీసీసీ అధ్యక్షుడు ఢిల్లీ పర్యటనలో ఉండగా.. అక్కడి నుంచి నరేందర్‌రెడ్డికి ఆహ్వానం రావడంతో పార్టీ పెద్దలను కలిసి టికెట్ కోసం విన్నవించనున్నట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలవడానికి ఢిల్లీకి వెళ్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నుంచి పలువురు అభ్యర్థిత్వం ఆశిస్తున్న నేపథ్యంలో తాజా పరిణామం చర్చనీయాంశమైంది.4 నుంచి సార్వత్రిక విద్య డిగ్రీ పరీక్షలు.సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి ప్రారంభమవుతాయని ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ సమన్వయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

## అంతర్జాలంలో దుకాణాల వివరాలు

**కరీంనగర్ -నవభూమి:** నగరంలో ట్రేడ్ లైసెన్స్ జారీకి దుకాణం కొలతలు తీస్తున్న సిబ్బంది జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా మారింది. రోడ్ల మీద, మార్కెట్లలో దుకాణాలు, సంస్థలు ఏర్పాటు చేస్తే చాలు కచ్చితంగా అనుమతులు అవసరం. రెండేళ్లుగా పురపాలక శాఖ దీనిపై దృష్టి సారించడంతో దీని ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతోంది. దుకాణాల స్థాయిని బట్టి రుసుము వసూలు చేస్తున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దుకాణాలు నమోదు కాకపోవడంతో ఏడాదికి ఎంతమేర ఆదాయం వస్తుందో తెలియకుండా మారింది. ప్రస్తుతం ఎన్ని వ్యాపార సంస్థలు ఉన్నాయనే విషయం బయటపడింది. దాని ఆధారంగా లైసెన్స్లు జారీ చేయడం, పునరుద్ధరణ లాంటివి చేపడుతున్నారు.ఫీజుల వసూళ్లకు బృందాలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లకు నగరవ్యాప్తంగా ఏడు బృందాలతో సర్వే ప్రారంభించారు. డివిజన్ల వారీగా ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దుకాణాలకు, వాణిజ్య సంస్థలకు వెళ్లి లైసెన్స్ పరిశీలించి అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో లైసెన్స్ రెన్యువల్ చేస్తున్నారు. ఆస్తి పన్ను మాదిరిగా ఏటా దుకాణాలకు ఫీజు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది. మార్చి వరకు గడువు ఉంటుండగా, ఏప్రిల్ నెలాఖరు వరకు ఎలాంటి జరిమానా ఉండదు. ఆ తర్వాత పునరుద్ధరించినా, ఇప్పుడే లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తే 25 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నగరంలో ఇప్పటివరకు కొత్త దరఖాస్తుల ద్వారా రూ.34.31 లక్షలు, రెన్యువల్ ద్వారా రూ.68.48 లక్షల ఆదాయం వచ్చింది.తప్పుగా మదింపు చేస్తే భారీ జరిమానా రహదారి వెడల్పు ఆధారంగా దుకాణం పొడవు, వెడల్పు ద్వారా వాణిజ్య, వ్యాపార సంస్థలకు చదరపు అడుగు లెక్కన రుసుం పరిగణనలోకి తీసుకుంటున్నారు.స్వీయ మదింపు ద్వారా ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ తీసుకునే అవకాశాన్ని కల్పించడంతో కొందరు వ్యాపారులు తెలిసి తెలియక, ఇష్టానుసారంగా నామమాత్రపు కొలతలతో దరఖాస్తు చేసుకొని వర్తక లైసెన్స్ తీసుకున్నారు.ఇన్నాళ్లు తనిఖీలు లేకపోగా ఎలాంటి సమస్యలు రాకపోగా, ప్రస్తుతం దుకాణాలు పెద్దగా ఉండి తక్కువ మొత్తంలో ఫీజు చెల్లిస్తున్న వాటిని పరిశీలించేలా ఆదేశాలు జారీ చేశారు.



# ఎరువుల నిల్వతో..
# భారంగా నిర్వహణ

**రామగుండం -నవభూమి:** రామగుండం ఎరువుల కర్మాగారం తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరో అయిదు రాష్ట్రాల్లో యూరియా కొరత నివారణకు కృషి చేస్తున్న రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది.ఆయా రాష్ట్రాల్లోని డీలర్లకు సరఫరా చేసిన యూరియా నిల్వలు పేరుకుపోతుండటంతో వాటిపై కేంద్రం పంపిణీ చేయాల్సిన రాయితీ నిలిచిపోతోంది. దీంతో నిర్వహణకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవాల్సి రావడంతో వడ్డీల భారం తప్పడం లేదు. ఆయా ప్రాంతాల రైతులకు యూరియా సరిపోతుండటంతో.. ఆర్ఎఫ్‌సీఎల్ వెళ్తున్న నిల్వలు అలాగే ఉంటున్నాయి.తెలంగాణలోనే అత్యధికం ఆర్ఎఫ్‌సీఎల్ సరఫరా చేసిన సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు డీలర్ల వద్దనే ఉన్నాయి. ఇందులో అత్యధికంగా తెలంగాణలోనే సుమారు 75 వేల మెట్రిక్ టన్నులు ఉండగా.. కర్ణాటకలో 50 వేలు, మహారాష్ట్రలో 34 వేలు, ఏపీలో 30 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు పేరుకుపోయాయి. డీలర్ల ద్వారా రైతులకు అమ్మిన యూరియాకు మాత్రమే ప్రభుత్వం రాయితీని చెల్లిస్తుంది. వార్షిక మరమ్మతులకు సంబంధించి ప్రస్తుతం కర్మాగారంలో ఉత్పత్తి నిలిపివేశారు. లేదంటే మరో రూ.లక్ష మెట్రిక్ టన్నుల వరకు పేరుకుపోయేవి. పర్యవేక్షణపై దృష్టి సారించిన కర్మాగార అధికారులు నిల్వలు పేరుకుపోవడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.రాయితీ చెల్లింపులిలా..యూరియాను నామమాత్రపు ధరలతో రైతులకు విక్రయిస్తుండగా.. మిగతా సొమ్మును రాయితీ రూపంలో కేంద్రం చెల్లిస్తుంది. 45 కిలోల సంచిని రైతుకు రూ.265కు విక్రయిస్తుండగా కేంద్రం రూ.1820 చెల్లిస్తుంది. ఒక్క మెట్రిక్ టన్నుపై సుమారు రూ.40 వేల రాయితీ



అందుతుంది. వారం రోజుల్లో విక్రయించిన యూరియా వివరాలతో కర్మాగారం అధికారులు ఎరువుల మంత్రిత్వ శాఖకు పంపించగానే రాయితీ విడుదలవుతుంది.నెలకు రూ.350 కోట్లు యూరియా అమ్మకాల ప్రకారం కర్మాగారానికి నెలకు దాదాపుగా రూ.350 కోట్ల రాయితీ వస్తుండగా.. మిగతా నిధులకు బ్యాంకు రుణాల వైపు చూడాల్సి వస్తోంది. కర్మాగారం నిర్వహణకు నెలకు రూ.400 కోట్లకు పైగా అవసరం కాగా.. అందులో దాదాపు రూ.350 కోట్లు గ్యాస్ బిల్లులే చెల్లించాల్సి వస్తోంది. మిగతావి ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, విద్యుత్తు వినియోగం, ఇతర నిర్వహణకు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం నిల్వ ఉన్న 2.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయిస్తే.. రూ.వెయ్యి కోట్ల వరకు రాయితీ రానుంది.

# ఖాతాదారుల
# పొదుపు సొమ్ము స్వాహా

**కమాన్‌పూర్-నవభూమి:** తపాలా కార్యాలయంలో వివిధ పథకాల కింద ఖాతాదారులు పొదుపు చేసిన సొమ్మును నకిలీ పాసుపుస్తకాలతో ఉద్యోగిని స్వాహా చేసిన ఘటన రామగిరి మండలం బేగంపేటలో వెలుగుచూసింది.గ్రామస్థులు ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆర్డీ(రికరింగ్ డిపాజిట్), సుకన్య సమృద్ధి యోజన, టైమ్ డిపాజిట్ వంటి పథకాల్లో డబ్బులు జమ చేస్తుండగా ఖాతాదారుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని కొన్నేళ్లుగా మహిళా ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. నకిలీ ఖాతా పుస్తకాలు, స్టాంపులు తయారు చేసి ఇవ్వడంతో ఎవరికీ అనుమానం రాలేదు.ఇలా వెలుగులోకి..కార్యాలయంలో పొదుపు చేసే కొందరి పాసుపుస్తకాలను బీపీఎం(బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్) తన వద్దే ఉంచుకున్నారు. ఇదేమని అడిగిన వారిలో కొందరికి ఇచ్చారు. గ్రామానికి చెందిన గుండ శ్రీను తన ఖాతా పుస్తకంతో సెంటినరీకాలనీలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆరా తీశారు. 2015 నుంచి ఇప్పటివరకు రూ.13 లక్షలు చెల్లించగా రూ.2.20 లక్షలు తక్కువగా చూపించింది. ఆయన గ్రామానికి వెళ్లి తెలిసిన వారికి విషయం చెప్పారు. వారు వెళ్లి ఆరా తీయగా ఖాతాల్లో డబ్బులు కనిపించలేదు. మోసపోయినట్లు గుర్తించి తపాలా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.అధికారుల విచారణ జమ్మికుంట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మోహన్, గోదావరిఖని మెల్ ఓవర్‌సెల్(ఎంవో) ప్రసాద్, పెద్దపల్లి ఎంవోలు సంపత్, కుమారస్వామి శనివారం బేగంపేట కార్యాలయంలో విచారణ జరిపారు. కార్యాలయంలో ఉన్న 206 పాసుపుస్తకాలను తనిఖీ చేయగా సుమారు రూ.25 లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. గ్రామస్థుల వద్ద ఉన్న పాసుపుస్తకాలు పరిశీలించాల్సి ఉందని, ఆదివారం నుంచి ఇంటింటికీ వెళ్లి విచారణ చేస్తామన్నారు. కార్యాలయ పరిధిలో మొత్తం వెయ్యి వరకు ఖాతాలుంటాయని, వాటన్నింటినీ తనిఖీ చేస్తే ఎంత సొమ్ము పక్కదారి పట్టిందనేది తెలుస్తుందన్నారు.బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు. ఉద్యోగిని ఉన్నతాధికారులు ప్రశ్నించగా సుమారు రూ.32 లక్షల వరకు వాడుకున్నానని ఒప్పుకొన్నట్లు తెలిసింది. బాధితులు మాత్రం సుమారు రూ.50-70 లక్షలు పక్కదారి పట్టాయని ఆరోపిస్తున్నారు. శనివారం ఖాతాదారులు పెద్దసంఖ్యలో బేగంపేట తపాలా కార్యాలయం వద్దకు రావడంతో రామగిరి పోలీసులు బందోబస్తు కల్పించారు. బీపీఎంను అధికారులు పిలిపించడంతో బాధితులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగిని ఒక్కరే స్వాహా చేశారా? ఇతరుల హస్తం ఉందా? అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

